నేడు మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి బయలు దేరి 9గంటలకు ఖమ్మం చేరుకొని వీడీవోస్ కాలనీలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఖమ్మం నగరపాలక సంస్థలో సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఖమ్మం గాంధీచౌక్, నర్తకి థియేటర్ రోడ్డులో 32, 36 డివిజన్లకు సంబంధించి సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 4గంటలకు రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో రైల్వే మూడో లైన్ ఏర్పాటులో భూములు కోల్పోయిన వారికి ఇళ్లస్థలాలు పంపిణీ చేయనున్నారు.

పెదవాగు ప్రాజెక్టుకు రూ.92 కోట్లు

- పునర్ నిర్మాణానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు
- గత జూలైలో భారీ వరదతో తెగిన కట్ట
- ప్రాజెక్టు తెలంగాణలో... మెజారిటీ ఆయకట్టు ఏపీలో..
- నిధులు 16:84 నిష్పత్తిలో కేటాయించాలని సూచన
- తాత్కాలిక రింగ్‌బండ్‌తో తెలంగాణలో 2,500ఎకరాలకు సాగునీరు

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/అశ్వారావుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ-ఆంధ్రా సరిహద్దులో భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు పునర్‌నిర్మాణానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ రూ.92కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి, కోయరంగాపురం గ్రామాల మధ్య ఉన్న ఈ పెదవాగు ప్రాజెక్టుకు గత జూలైలో ఆకస్మికంగా కురిసిన భారీవర్షాల కారణంగా గండిపడి కట్ట కొట్టుకుపోయింది. ఎగువన ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో కేవలం 4గంటల్లో 33 సెం.మీ వర్షం కురవడంతో పెదవాగు ప్రాజెక్టులోకి అనూహ్యంగా 88 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. ఈ సమయంలో ప్రాజెక్టుకు సంబంధించిన మూడుగేట్లు సక్రమంగా పనిచేయకపోవడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయిన విషయం విదితమే. 150మీటర్ల పొడవున ప్రాజెక్టు కట్టకు భారీ గండిపడడంతో కింద ఉన్న పొలాలు కొట్టుకుపోవడం, ఇసుక మేటలు వేయడంతో భారీనష్టం జరిగింది.

పెదవాగు ప్రాజెక్టు హెడ్‌వర్క్ తెలంగాణలో ఉండడం, ఆయకట్టు ప్రాంతం ఆంధ్రాలో ఉండడంతో రాష్ట్ర విభజన తరువాత ఈ ప్రాజెక్టు నిర్వహణలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. రాష్ట్ర విభజన పెదవాగు ప్రాజెక్టుకు పెద్దశాపంగా మారింది. ప్రాజెక్టు రెండు రాష్ట్రాల్లోకి వెళ్లడంతో దీని మరమ్మతులకు ఎవరు నిధులివ్వాలనే విషయంలో వివాదం తలెత్తడంతో చివరికి ఈ సమస్య కేంద్ర జలసంఘం వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే గత జులైలో కురిసిన భారీ వర్షంతో ప్రాజెక్టుకు గండిపడి కొట్టుకుపోవడంతో ఇప్పుడు దీని మరమ్మతుల వ్యవహారం రెండు రాష్ట్రాల సమస్యగా మారింది.



గత జూలైలో వచ్చిన భారీ వరదతో కొట్టుకుపోయిన పెదవాగు ప్రాజెక్టు

1975లో నిర్మాణం...

1975 ప్రాంతంలో అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లా, అశ్వారావుపేట మండలం, గుమ్మడపల్లి వద్ద 16వేల ఆయకట్టుకు సాగునీటితో పాటు పలు గ్రామాలకు తాగునీరు అందించేందుకు 'పెదవాగు' మధ్య తరహా ప్రాజెక్టును నిర్మించారు. 2.4 కి.మీ. పొడవు, 10 నుంచి 22మీటర్ల ఎత్తున 0.55 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ ప్రాజెక్టు ఆయకట్టు అశ్వారావుపేట మండలంలో 2,500 ఎకరాలు మాత్రమే ఉండగా మిగిలిన 13,500 ఎకరాలు ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు, కుక్కునూరు మడలాల్లోకి వెళ్లింది. తెలంగాణలో తక్కువ ఆయకట్టు, ఏపీలో ఎక్కువ ఆయకట్టు ఉండడంతో ఈ ప్రాజెక్టు నిర్వహణ ఖర్చు కూడా అదే నిష్పత్తిలో తెలంగాణ 16 శాతం, ఏపీ 84 శాతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం సూచిస్తోంది. ఆ ప్రకారం రూ.92కోట్లతో ప్రాజెక్టు (మిగతా 8వ పేజీలో)

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 15,16 తేదీల్లో రెండు విడతల్లో పరీక్షలు
- 85 పరీక్షా కేంద్రాలు..28 వేలమంది అభ్యర్థులు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు..
- అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

6

పెద్దపులి అలజడి



6

- రెండు రోజులుగా ములుగు జిల్లా అడవుల్లో సంచారం
- అక్కడి నుంచి భద్రాద్రి జిల్లా అడవుల్లోకి అడుగుపెట్టినట్టు అనుమానాలు
- కిన్నెరసాని అభయారణ్యంలోకి వచ్చే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలన్న అటవీశాఖ అధికారులు

నకిలీ బంగారు కడియంతో

బురిడీ

- ఇల్లెందు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.లక్షా10వేల రుణం పొందిన వ్యక్తి
- తనిఖీల్లో గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసిన బ్యాంకు అధికారులు
- బంగారు కడియంపై హాల్‌మార్క్ ముద్ర
- ముఠాపై ఆరా తీస్తున్న పోలీసులు



హాల్‌మార్క్ వేసిన కడియం, అధికారుల తనిఖీలో గుర్తించిన నకిలీ బంగారం

ఇల్లెందు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారు వస్తువు తాకట్టు పెట్టి బ్యాంకులో రుణం పొందిన ఘరానా మోసం తాజాగా ఇల్లెందులోనూ వెలుగుచూసింది. ఖమ్మం జిల్లాలో బ్యాంకులను బురిడీ కొట్టిస్తూ నకిలీ బంగారు ఆభరణాలతో కోట్లాది రూపాయల రుణాలు కొల్లగొట్టిన ముఠా ఉందతం ఇటీవల వెల్లడైన విషయం తెలిసిందే. గోల్డ్‌లోన్ పేరిట తనఖాపెట్టిన ఆభరణాల తనిఖీలు చేపట్టిన క్రమంలో ఇల్లెందు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులోనూ ఒక నకిలీ బంగారు కడియాన్ని గుర్తించారు. ఖమ్మం సమీపంలోని ఏదులాపురం చిన్నతండాకు చెందిన భూక్యా మల్సూరు 25గ్రాముల బంగారు చేతికడియాన్ని తాకట్టుపెట్టి ఇల్లెందు పట్టణంలోని ఏపీజీవీబీ నుంచి రూ.లక్షా 10వేల రుణం పొందాడు.

నకిలీ బంగారంతో రుణాలు పొందుతున్న ముఠాలో భూక్యా మల్సూరు, బానోతు శంకర్, ఎస్‌కే రహీంపాషా తదితరులు సభ్యులుగా ఉన్నారు. వీరు తమ పేర్లతో గోల్డ్‌లోన్లు పొందిన ఖాతాలను బ్యాంకుల్లో అధికారులు పరిశీలించారు. కాగా మల్సూరు ఇల్లెందులో ఒక నకిలీ బంగారు కడియంతో గోల్డ్‌లోన్ పొందినట్లు గుర్తించి ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసు సీఐ బత్తుల సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మల్సూరుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. నకిలీ బంగారం బ్రాస్‌లెట్లు, (మిగతా 6వ పేజీలో)

వైభవంగా మహా చండీయాగం

- నారాయణపురంలో ఆధ్యాత్మిక సౌరభం

7

డబుల్ ఇళ్ల పేరుతో వసూళ్లపై రగడ

- డబ్బులిచ్చిన వారిని చల్లబర్చేందుకు దళారుల ప్రయత్నం
- రూ.కోటి వరకు వసూలు చేశారంటూ ఆరోపణలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై సర్వత్రా చర్చ

భద్రాచలం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలో డబుల్ ఇళ్ల కేటాయింపు చోటు చేసుకోకపోవడంతో దళారులను నమ్మి మోసపోయిన ఆశావాహ బాధితులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమకు ఇల్లు కేటాయిస్తారనే గంపెడాశతో తాము డబ్బులిస్తే మూడేళ్ల అనంతరం జాబితాలో తమ పేరు లేకపోగా డబ్బులు తీసుకున్న దళారులు పత్తా లేకపోవడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. డబ్బులు తీసుకున్న కొందరు రాజకీయ దళారులు మీ పేరు రెండో జాబితాలో ఉంటుంది. కంగారు పడకండి అంటూ వారిని చల్లబరిచే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అయితే ఈ మాటలను ఏ మాత్రం విశ్వసించని బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. కాగా మరికొందరు బాధితులు దళారులను తమ డబ్బులు తమకు ఇచ్చేయమని డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల్లో ఈ విషయంపై ఎటువంటి స్పష్టత లేకపోతే నిరసనలకు దిగేందుకు సైతం వెనుకాడేది లేదని వారు స్పష్టం చేస్తున్నట్టు వినికిడి. దీంతో ఈ పరిస్థితి నుంచి ఎలా బయటపడాలో అర్థంకాక సదరు రాజకీయ దళారులు ఆశావాహులకు అందుబాటులో లేకుండా తిరుగుతున్నారు.

రూ.కోటి వరకు వసూలు

భద్రాచలంలో 250 ఇళ్ల వరకు నిర్మాణం ప్రారంభించగా.. అందులో 117 ఇళ్లు పూర్తికాగా వాటిని అర్హులకు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే డబుల్ ఇల్లు ఇప్పిస్తామని గతంలో రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు వసూలు చేసినట్టు బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ విధంగా సుమారు రూ.80లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఒక్కసారిగా డబ్బులిచ్చిన ఆశావాహులు రాజకీయ దళారులను నిలదీస్తుండటంతో రాజకీయ పార్టీల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. ఇందులో రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలకు చెందిన స్థానిక ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు కీలక పాత్ర పోషించినట్టు సమాచారం.

'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

బుధవారం'ఆంధ్రజ్యోతి'లో డబుల్‌వంచనకు గురైన ఆశావాహుల పేరుతో మూడేళ్ల క్రితం జరిగిన అక్రమ వసూళ్ల పర్వం బయటకు రావడంతో భద్రాచలంలో రాజకీయ వర్గాలు, స్థానికుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. అధికశాతం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనం అక్షరసత్యమన్నారు. ఈ వారంలోపు తమకు న్యాయం జరగకపోతే తమ వద్ద ఉన్న ఆధారాలతో పోలీసులను ఆశ్రయిస్తామని బాధితులు పేర్కొంటున్నట్టు వినికిడి.

లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలి: జీఎం

రుద్రంపూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలోని ఉద్యోగులు, కార్మికులు నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తూ వినియోగదారులకు అందించే విధంగా కృషి చేయాలని కొత్తగూడెం ఏరియా మేనేజర్ షాలేం రాజు తెలిపారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 ఇంక్లైన్ నందు మల్టీ డిపార్ట్‌మెంట్ టీంతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ సమావేశంలో డీజీఎం ఐఈడీ ఎస్.యోహాన్, ఏజీఎం(ఫైనాన్స్) హనా సుమలత, డీజీఎం(పర్సనల్) బి.శివకేశవరావు, పీవీకే 5 ఇంక్లైన్ మేనేజర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంచేందుకే ఉద్దీపకం

ఐటీడీఏ పీవో రాహుల్



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

గుండాల, డిసెంబరు 11: గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థుల కనీస సామర్థ్యాలను పెంపొందించడంకోసమే ఉద్దీపకం వర్క్‌బుక్‌ను విడుదల చేయడం జరిగిందని భద్రాచలం ఐటీడీఏ పీవో బీ రాహుల్ అన్నారు.మంగళవారం రాత్రి మండలంలోని కాచనపల్లి(శంభునిగూడెం) ఆశ్రమ పాఠశాలను సందర్శించి, ఉద్దీపకం పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడంలో విద్యార్థులు వెనుకబడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులతో వంద రోజుల ప్రణాళిక ద్వారా ఈ ఉద్దీపక పుస్తకాలు రూపొందించడం జరిగిందన్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు చదివించడం, రాయించడం చేయాలని, పాఠ్యాంశాలను అర్థమయ్యేలా చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలకు పునాది గట్టిపడినప్పుడేపై తరగతులు భయంలేకుండా వెళ్తారని తెలిపారు. దీనిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉద్దీపకం పుస్తకంలోని ఇంగ్లీష్, గణితం పదాలను ఒక్కో విద్యార్థితో బోర్డుపై రాయించి చదివించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏటీడీవో రాధమ్మ, పాఠశాల హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.

14న జయశంకర్ తెలంగాణ

వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవం

హాజరుకానున్న మంత్రి తుమ్మల, పలువురు ఎమ్మెల్యేలు

అశ్వారావుపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్శిటీ వజ్రోత్సవాలు జరుగనున్నట్టు కళాశాల అసోసియేట్ డీన్ డా.హేమంతకుమార్ వెల్లడించారు. వ్యవసాయ యూనివర్శిటీని స్థాపించి ఇప్పటికి 60 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా యూనివర్శిటీతో పాటు కళాశాలల్లో కూడా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కేవీకే కొత్తగూడెం, కేవీకే ఖమ్మం, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలను కలిపి అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో వజ్రోత్సవాన్ని జరిపించాలని నిర్ణయించారు. ఈ మేరకు 14వ తేదీ ఉదయం 10గం.లకు వజ్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతోపాటు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్టు తెలిపారు. యూనివర్శిటీ డీన్ సత్యనారాయణ, హార్టికల్చర్ యూనివర్శిటీ డీన్ రామిరెడ్డి, పలువురు పూర్వ విద్యార్థులు, శాస్త్రవేత్తలు హాజరుకానున్నారు. ఇప్పటికే వారందరికీ కళాశాల నుంచి ఆహ్వానాలు పంపారు. కళాశాలలో వజ్రోత్సవం నిర్వహిస్తుండటంతో ఇప్పటికే కళాశాలలో పండుగ వాతావరణం నెలకొంది.



పశు గ్రాసం.. మిషన్‌తో కట్టలు

మిషన్‌తో గడ్డి కట్టిస్తున్న రైతులు



కరకగూడెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పశుగ్రాసం కోసం రైతులు పడరాని పాట్లు పడేవారు. కానీ ఇప్పుడు రైతులు కోత మిషన్ల ద్వారా కోసిన గడ్డిని కట్టే మిషన్లు రావడంతో రైతులకు గ్రాసం కోసం ఇబ్బందులు తప్పుతున్నాయి. గతంలో రైతులు కోత మిషన్లు రాని సమయంలో కూలీల ద్వారా కోతలు కోసి కుప్పలు వేసేవారు. తరువాత పడుగులు పెట్టి ట్రాక్టర్ ద్వారా పడుగులు తొక్కించి కూలీలతో గడ్డి కట్టలు కట్టించి రైతులు తమ ఇంటి పెరట్లో గడ్డి వాములుగా ఏర్పాటు చేసుకుని పశువులకు మేత వేసేవారు. రోజులు మారడంతో చైన్ మిషన్లు, కోత మిషన్లు రావడంతో పశువులకు గ్రాసం లేక అనే ఇబ్బందులు పడుతూ బక్కి చిక్కడంతో రైతులు పశువుల బేరగాళ్లకు విక్రయిస్తున్నారు. అంతేకాక ఎరగడి మంటలు పడి గ్రాసం పూర్తిగా కాలి బూడిదగా మారుతుంది. ఇప్పుడు రైతులు మిషన్‌తో కోసిన వరి గడ్డిని గడ్డి కట్టలు కట్టేందుకు మిషన్లు రావడంతో రైతులు మిషన్‌తో గడ్డి కట్టలు కట్టిస్తున్నారు. మిషన్‌తో గడ్డి కట్టినందుకు రూ.40 మిషన్ యజమానికి రైతు చెల్లిస్తాడు. అనంతరం కట్టలను ట్రాక్టర్‌తో ఇంటికి తీసుకెళ్లి వాములుగా ఏర్పాటు చేసుకుంటారు. కొందరు రైతులు కూలీలకు ట్రాక్టర్ లోడు చేసి ఇంటి వద్ద వాము పెట్టినందుకు కట్టకు రూ.15 తీసుకుంటున్నారు. దాంతో కొందరు రైతులకు కూలీల కొరత లేకుండా పోతోంది. ఇప్పుడు గ్రాసం కొరత లేకుండా పోతుండటంతో రైతుల ఇబ్బందులు తప్పాయని పలువురు తెలుపుతున్నారు.



ఔరా..!

చిత్రలేఖనంలో రాణిస్తున్న సమీర్



ఏన్కూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనంలో అద్భుతమైన చిత్రాలు గీస్తూ ఔరా అనిపిస్తున్నాడు ఏన్కూరు గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ సమీర్. చిత్రలేఖనంపై మక్కువతో చిత్రాలను గీస్తున్నాడు. ఒక్కసారి చూస్తే చాలు ఎలాంటి చిత్రాలనైనా అలవోకగా అచ్చం అచ్చుగుద్దినట్టు వేయడంలో దిట్ట. దేశ నాయకులైన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, భగత్‌సింగ్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ తదితరుల చిత్రాలు అలవోకగా గీస్తాడు. సినీ ప్రముఖుల చిత్రాలు, దేవుళ్ల చిత్రాలను అబ్బురపరిచేలా గీయడం విశేషం. ప్రకృతి అందాలు, అడవులు, పక్షులు, గ్రామీణ మహిళలు, ఉమ్మడి కుటుంబాలలు, సంక్రాంతి పండుగ వాతావరణం, ఆకాశం, సాయంకాలం సంధ్య వేళ తదితర చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. పాతకాలం నాటి లాంతర్లు, కుండలు, రోళ్లు నేటి తరానికి తెలిపే చిత్రాలు అనేకం ఉన్నాయి. ఆర్ట్ టీచర్ అయిన తండ్రి సైదులు ప్రోత్సాహంతో మక్కువ పెంచుకున్నాడు. తండ్రి బొమ్మలు గీసేటప్పుడు దగ్గర ఉండి పరిశీలించేవాడు. ఆ విధంగా చిత్రలేఖనంపై ఆసక్తి కలిగింది. ఆరో తరగతి నుంచే బొమ్మలు గీయడం మొదలు పెట్టాడు. చిత్రలేఖనంలో రాణించడానికి ప్రత్యేక కృషిచేస్తున్నట్టు సమీర్ తెలిపాడు. చిత్రలేఖనంతో రాణిస్తున్న సమీర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 15, 16 తేదీల్లో రెండు విడతల్లో పరీక్షలు
- 85 పరీక్షా కేంద్రాలు...
- 28 వేల మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన గ్రూప్-2 పరీక్షా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 15, 16 తేదీలలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5-30 వరకు రెండు విడతలో గ్రూప్ 2 పరీక్షలు జరిపేందుకు ఏర్పాట్లు వుండాలని అధికారులకు ఆదేశించారు. ఖమ్మం జిల్లాలో 28 వేల 101 మంది అభ్యర్థులకోసం 85 పరీక్షా కేంద్రాలు సిద్ధం చేశామన్నారు.

ఇద్దరు రీజనల్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో 85 పరీక్షా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి. చిన్నయ్య రీజినల్ కోఆర్డినేటర్-1గా, 40 పరీక్షా కేంద్రాలు,ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజకుమార్ రీజనల్ కోఆర్డినేటర్-2గా 45 పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూమ్ పని చేస్తుందన్నారు. ప్రశ్న పత్రాలను పరీక్షా కేంద్రాలకు తరలించేందుకు వీలుగా ఎంపీడీవోలను జాయింట్ రూట్ అధికారులుగా, ప్రతి 3 నుంచి 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు తహసీల్దారులను ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులుగా నియమించామని చెప్పారు. ప్రశ్నా పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒకరోజు ముందు పరీక్ష కేంద్రం పరిసరాలను చీఫ్ ఇన్విజిలేటర్ క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు.

ఒక్కనిమిషం నిబంధన అమలు

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8-30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1-30 నుంచి అనుమతిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం సెషన్‌లో 9-30 గంటలకు, మధ్యాహ్నం 2-30 గంటలకు మూసి వేస్తామని, దీని తర్వాత పరీక్ష కేంద్రాల లోనికి ఎవరిని అనుమతించబోమని ఒక్కనిమిషం ఆలస్యం అయినా అనుమతించేది లేదని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఏసీపీ ఎన్. నర్సయ్య, రీజినల్ కో ఆర్డినేటర్ లు డా. వి. చిన్నయ్య, డా. జి. రాజ్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి బి. కళావతి బాయి, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లు, కలెక్టరేట్ ఏఓ. అరుణ, రవాణా, పోలీస్‌శాఖ అధికారులు, మునిసిపల్ అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వాగ్దానాలను తుంగలో తొక్కుతున్నారు..

- లగచర్ల విజయం కమ్యూనిస్టులదే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

కొణిజర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంలో బుధవారం సీపీఎం వైరా డివిజన్ 3వ మహాసభను నిర్వహించారు. ముందుగా గ్రామంలో నిర్వహించిన ప్రదర్శనలో తమ్మినేని ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతి మహిళకు రూ.2500 ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వలేదు, కౌలు రైతులకు పెట్టుబడిసాయం ఇవ్వటం లేదు. కార్మికులకు కనీస వేతనం ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. ఆశాలకు, అంగన్‌వాడీలకు వాగ్దానాలు చేసి అమలు చేయటం లేదు. ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్న వారిని కొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిన వాగ్దానాలు ఏమి అమలు కావడంలేదు. ప్రజల్లో కూడ ప్రభుత్వం పై నమ్మకం పోయి పోరాడాలి అనే ఆలోచన వచ్చిందని అన్నారు. పోరాడేపార్టీ వైపు చూస్తున్నారు. ఆ పోరాడే పార్టీ కమ్యూనిస్టు అని ప్రజలు గ్రహించారని తెలిపారు. ఎన్నికల్లో చేసిన ప్రతి వాగ్దానం అమలు చేయకపోతే భవిష్యత్తులో పోరాటాలు తప్పవని తమ్మినేని హెచ్చరించారు.

లగచర్లకు న్యాయం ఎమ్మెల్యే వల్లనో.., ఎంపీ వల్లనో వచ్చింది కాదు, పోరాడటం వల్లనే వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడితే కేసీఆర్ ప్రభుత్వంలో ఏడు లక్షల కోట్లు అప్పులు చేశాడని మాట్లాడుతున్నాడు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇంత అప్పు చేశాడని తెలవదా? ఎన్నికల సమయంలో లక్షల కోట్లకు హామీలను నువ్వు ఎందుకు ఇచ్చావు అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులంతా ఐక్యంగా ఉండాలని, జనం అంతా పోరాటాలవైపు చూస్తున్నారని, వారితో కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, మాచర్ల భారతి, పొన్నం వెంకటేశ్వరరావు, సోమయ్య, ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేష్, విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, తాళ్ళపల్లి కృష్ణ, సంక్రాంతి మధుసూదన్‌రావు, షేక్ అఫ్జల్, వడ్లమూడి నాగేశ్వరరావు, దొడ్డపునేని కృష్ణార్జునరావు, రోషన్‌బేగ్, బొంతు సమత, వడ్లమూడి ఉమారాణి, సుధాకర్, నరేందర్, నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు అవకాశాలను వినియోగించుకోవాలి

- భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ అభ్యర్థులు అవకాశాలను వినియోగించుకోవాలని భద్రాద్రి జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ సూచించారు. బుధవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయ హాల్లో నిర్వహించిన జాబ్ మేళాలో అభ్యర్థులతో మాట్లాడారు. హైదరాబాద్ హెటిరో నెక్సిటీ కంపెనీలో పని చేయడానికి మూడు క్యాటగిరిలలో 150 మందిని భర్తీ చేసేందుకు ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేయగా 32 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 9 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు.

నకిలీ బంగారు కడియంతో బురిడీ

(5వ పేజీ తరువాయి)

చేతి కడియాలను తాకట్టుపెట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా కోట్లాది రూపాయలు బ్యాంకుల నుంచి రుణాలుగా పొందటంలో ఒక ముఠా కీలకంగా పనిచేస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో డీసీసీబీ, భద్రాద్రి కో ఆపరేటివ్ బ్యాంక్, ఏపీజీవీబీ, తదితర వాణిజ్య బ్యాంకుల్లో జరిపిన తనిఖీల్లో నకిలీ చేతి కడియాలు, బ్రాస్‌లెట్లు గుట్టురట్టు కావడంతో బ్యాంకు అధికారులు అప్రమత్తమై గోల్డ్‌లోన్ కోసం తాకట్టుపెట్టిన బంగారు నగలు, ఆభరణాలన్నింటినీ తనిఖీ చేస్తున్నారు.

బంగారు కడియాలు, బ్రాస్‌లెట్లను పూత బంగారంతో చేసి, లోపలి భాగంలో వేరే లోహం అమర్చి నిజమైన బంగారు వస్తువుగానే భ్రమింప చేస్తున్నారు. ఒక ముఠా రహస్యంగా వీటిని తయారుచేస్తోందన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ముఠాగా ఏర్పడిన కొందరు వివిధ బ్యాంకుల్లో గోల్డ్‌లోన్‌లు తీసుకోవడంలో బ్యాంకు అధికారుల పాత్ర కూడా వుంటుందన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన అపరిచిత వ్యక్తులు బంగారు ఆభరణాలు తెచ్చి గోల్డ్‌లోన్ పొందే క్రమంలో వారిని ఎందుకు అనుమానించలేదనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిసింది. నకిలీ బంగారు వస్తువుల పైభాగంలో హాల్‌మార్క్ ముద్రణ ఉండటంతోపాటు క్వాలిటీ పరీక్షల్లో చిక్కకుండా ఎలా తయారు చేశారు. ఈ కేంద్రం ఎక్కడ ఉంది..? అసలు సూత్రధారులెవరు? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తుచేపట్టారు.

గ్రామాలు, తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ప్రతీ గ్రామంలో పక్కా రహదారులు, డ్రెయిన్లు నిర్మిస్తాం: ఎమ్మెల్యే కూనంనేని



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ మండల కేంద్రంలో రెండో రోజు బుధవారం విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. గ్రామాలు, తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సుజాతనగర్ మండలంలో తం డాల, గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడు తున్నామని, పక్కా రహదారులు, మురికి కాలువ లు అనతి కాలంలోనే పూర్తిచేసి రవాణా వ్యవస్థ ను అభివృద్ధి చేస్తామని అన్నారు. మండలంలోని సర్వారం, నర్సింహసాగారం, కొత్త అంజనాపురం, బేతంపుడి, సింగభూపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో రూ. 1.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై సర్వే నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని, నాణ్యతతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, లోపాలను గుర్తిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, మండల కార్యదర్శి దస్రు, జిల్లా సమితి సభ్యులు కోమారి హనుమంతరావు, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో భారతి, ఏవో నర్మద, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలోఫర్, పీఆర్‌డీఈ సత్యన్నారాయణ, ఏఈ శివలాల్, విద్యుత్ ఏఈ కిషన్, నాయకులు పొదిల శ్రీను, వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు, దుర్గ, కొమారి కృష్ణ, వెంకటేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అడవుల్లో పెద్దపులి అలజడి



పులి పాదముద్రలు

కరకగూడెం/ఆళ్లపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అడవుల్లో రెండు రోజులుగా సంచరిస్తున్న పెద్దపులి... సరిహద్దున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడవుల్లో అడుగుపెట్టే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. మల్లూరు, నర్సింహసాగర్, మంగపేట అటవీ ప్రాంతం నుంచి కరకగూడెం మండల పరిధిలోని అడవిలోకి పెద్దపులి వచ్చే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు తెలపడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కరకగూడెం, తాడ్వాయి, ఏటూర్‌నాగారం, గుండాల, ఆల్లపల్లి మండలాల్లో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండటంతో గతంలో పెద్దపులి సంచరించిన దాఖలాలు ఉన్నాయి. ఏటూర్‌నాగారం, మంగపేట, మల్లూరు, రాజుపేట గోదావరి పరివాహక ప్రాంతం కావడంతో పాటు మల్లూరు నర్సింహాసాగర్, మంగపేట, కాటపురం, రంగాపురం, కరకగూడెం మండలం అటవీ ప్రాంతమైనందున పెద్దపులి కరకగూడెం మండలంలోకి చొరబడే అవకాశం ఉందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడూళ్ళ బయ్యారం రేంజర్ ఉపేందర్ కోరారు.

ఇదిలావుండగా, ములుగు జిల్లాలో పెద్దపులి సంచరిస్తున్న ఆనవాళ్ల ఆధారంగా... జిల్లాలోని గుండాల, రేగళ్ల, ఆళ్లపల్లి రేంజ్ అడవుల ద్వారా పాల్వంచ కిన్నెరసాని అభయారణ్యంలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్టుగా భావిస్తున్నారు. దీంతో రేగళ్ల రేంజర్ జశ్వంత్, ఆళ్లపల్లి రేంజర్ కిరణ్ అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. పెద్దపులి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఆనుకొని ఉన్న తాడ్వాయి అడవుల ద్వారా నీలాద్రిపేట, రేగళ్ల, ఆళ్లపల్లి అడవుల్లోకి వస్తే రావొచ్చని తెలిపారు. అందువల్ల అడవులకు దగ్గరగా ఉన్న వారు, పొలం పనులకు వెళ్లే రైతులు, పశువులు, మేకల కాపరులు, అడవి మార్గంలో ఒంటరిగా ప్రయాణం చేసేవారు, అటవీ ఉత్పత్తులు సేకరించే వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండేళ్ల క్రితం ములుగు జిల్లా కొడిశాల నుండి గుండాల, రేగళ్ల, ఆళ్లపల్లి, మణుగూరు రేంజ్ పరిధి అడవుల్లో సంచరించిన పులి... అనేక పశువులపై దాడి చేసింది.

వైభవంగా మహా చండీయాగం

» వేలాది మంది భక్తులతో కిటకిటలాడిన గ్రామం

తల్లాడ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో బుధవారం మహాచండీయాగం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు కంచల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో చండీ ఉపాసకుడు రాజోలు భాను రవికిరణ్‌శర్మ మహా చండీయాగాన్ని నిర్వహించారు.



మహాచండీయాగంలో పాల్గొన్న దంపతులు



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఈ సందర్భంగా మంగళతోరణ అలంకరణ, గణపతి పూజ, దీక్షాధారణ, అగ్ని ప్రతిష్ఠ, రుద్ర నవగ్రహముల మంత్ర హోమములు నిర్వహించారు. తదుపరి మహా చండీయాగం జరిగింది. 69 హోమ గుండాలు, 85 మంది అర్చక పండితులు, 207 మంది దంపతులు హోమం చేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు తల్లాడ, కల్లూరు, వైరా, ఏన్కూరు, తదితర మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో నారాయణపురం వీధులన్నీ కిటకిటలాడాయి. మహాచండీయాగంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, పొట్టేటి జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల అచూకీ లభ్యం



చెట్లలోంచి వస్తున్న చిన్నారులు

అశ్వాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొండికుంటలో పాఠశాలకు వెళ్లిన చిన్నారులు ఇళ్లకు తిరిగి రాకపోవడంతో గ్రామంలో మంగళవారం రాత్రి కలకలం రేపగా, బుధవారం తెల్లవారుజామున చిన్నారుల ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. మొండికుంట ఎస్టీ కాలనీకి చెందిన పర్శిక మహేష్ కుమారుడు ప్రసాద్(10), కుమార్తె కావ్య(8), మిడియం భిక్షం మనువరాలు నాగశ్రీ(7)లు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈనేపథ్యంలో మంగళవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత ఇంటికి బయలు దేరిన చిన్నారులు ఇళ్లకు చేరలేదు. దీంతో తల్లిదండ్రులు గ్రామం మొత్తం వెతికినా, బంధువుల ఇళ్లలో అడిగినా ఎక్కడా జాడలేకపోవడంతో ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈవిషయం స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో వైరల్ అయ్యింది. దీంతో గ్రామంలోని యువత, పోలీసులు అర్ధరాత్రి దాటేవరకు చుట్టు పక్కల గాలించారు. అయినా చిన్నారుల ఆచూకీ తెలియరాలేదు. తెల్లవారుజామున ఎస్టీ కాలనీ సమీపంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అటవీ సమీపంలో చెట్టు వద్ద పిల్లలు ఉన్న విషయాన్ని పోలీసులకు తెలపడంతో అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారులను బయటకు తీసుకు వచ్చి వివరాలు సేకరించారు. తాము పాఠశాల వదిలిన తర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో ఆడుకోవటానికి వెళ్లామని, ఇంతలో చీకటిపడడంతో తల్లిదండ్రులు తిడుతారనే భయంతో ఇక్కడే ఉన్నామని చిన్నారులు తెలపడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

టేకులపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దారం గ్రామ సమీపంలోని ఆలయం వద్ద బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతి చెందిన మగ వ్యక్తి చామన చాయరంగుతో సుమారు 40నుంచి 45సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడని, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని, నలుపు, తెలుపుజుట్టుతో ఉన్నాడని భిక్షాటన చేసుకుంటున్న వ్యక్తిగా భావిస్తున్నట్లుగా తెలిపారు.

కేసీహెచ్‌పీలో బంకర్ పిల్లర్‌ను ఢీకొన్న ట్యాంకర్

» త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

మణుగూరుటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో బుధవారం ఓ ట్యాంకర్ అదుపు తప్పి కేసీహెచ్‌పీ బొగ్గు లోడింగ్ బంకర్‌కు సంబంధించిన ఓ పిల్లర్‌ను ఢీకొంది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం సంభవించకపోయినప్పటికీ వాహనం మాత్రం బాగా దెబ్బతింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వేమూరి శ్రీధర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అంతే కాకుండా ఈ డిజిల్ ఉన్న ఈ ట్యాంకర్‌కు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. జరిగిన ప్రమాద విషయాన్ని తెలుసుకున్న వెంటనే స్థానిక గని అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. ప్రమాదం జరిగిన తీరును గమనించారు. ఓ వైపు ఏరియాలో రక్షణ పక్షోత్సవాలు జరుగుతుండగా మరో వైపు కేసీహెచ్‌పీలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం గమనార్హం. జరిగిన ప్రమాదంపై అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది, వాహనంలో తలెత్తిన సాంకేతిక లోపమా, లేదా డ్రైవర్ పూర్తి స్థాయి నిర్లక్ష్య వైఖరా అన్న విషయాలు విచారణలో వెలుగుచూడనున్నాయి.

హత్యాయత్నం కేసు నమోదు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాయతిరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన పెండ్ర రవి కొంతకాలంగా భార్య దుర్గ స్వగ్రామమైన అశ్వారావుపేట మండలంలోని ఆసుపాకలో నివాసం ఉంటున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. కాగా రవి భార్యపై అనుమానంతో పాటు కుటుంబ కలహాల నేపథ్యంలో వేరుగా ఉంటున్నాడు. మద్యం సేవిస్తూ ఆమె వద్దకు వచ్చి గొడవ పడేవాడు. ఈక్రమంలోనే శనివారం రాత్రి నిద్రిస్తున్న దుర్గపై దాడికి దిగాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన దుర్గను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దుర్గ కుమారుడు అశోక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రవిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గతమెంతో ఘనం..

» ప్రాభవం కోల్పోయిన కొత్తగూడెం మైనింగ్ కళాశాల
» 1978లో సింగరేణి సహకారంతో ఏర్పాటు
» నిర్వహణ మరచిన కాకతీయ యూనివర్సిటీ
» శిథిలావస్థలో కళాశాల భవనాలు, వసతి గృహాలు
» యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలని మంత్రి తుమ్మల ప్రతిపాదన



కొత్తగూడెం కేఎస్ఎమ్ కళాశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బోర్డు

చుంచుపల్లి(కొత్తగూడెం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఆ కాలేజీలో సీటు పొందాలంటే ఉత్తమ ర్యాంక్ వస్తేనే సాధ్యమయ్యేది. కానీ నేడు ఆ కాలేజీ పేరు చెబితేనే భయపడిపోతున్నారు. ఒకప్పుడు నిపుణులైన మైనింగ్ ఇంజనీర్లను అందించిన ఈ కాలేజీ, నేడు ఉనికి కోసం పోరాడుతోంది. రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలగా గుర్తింపు పొందిన కొత్తగూడెం మైనింగ్ కాలేజీలో గతంలో ఉన్నత ప్రమాణాలతో మైనింగ్ విద్యను అందించే వారు. కానీ ప్రస్తుతం ఆ కళాశాల పరిస్థితి దయనీయంగా మారింది. దేశంలోనే ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థగా గుర్తింపు పొందిన సింగరేణి కాలరీస్ 'కంపెనీ ఇండియా'తో పోటీ పడాలనే ఉద్దేశ్యంతో సింగరేణి సహకారంతో 1978లో కొత్తగూడెం ఏరియాలో మైనింగ్ కళాశాలను ప్రారంభించారు. 1979లో ఈ కళాశాలను కొత్తగూడెం, పాల్వంచ అటవీ ప్రాంతంలోకి తరలించారు. అనంతరం ఈ కళాశాలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్-కొత్తగూడెం (కె.ఎస్.ఎమ్)గా నామకరణం చేశారు.

ఐదు బ్రాంచ్‌లు.. 300మంది విద్యార్థులు

కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో ప్రతి ఏడాది ఐదు బ్రాంచ్‌లలో 300మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మైనింగ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) గ్రూపులుండగా, ఒక్కొక్క గ్రూప్‌లో 60 మంది, మొత్తం ఒక విద్యాసంవత్సరానికి 300 మంది విద్యార్థులు ఎంసెట్, ఈసెట్ ద్వారా అడ్మిషన్లు పొందుతున్నారు. మొత్తం నాలుగు సంవత్సరాలకు కలిపి కళాశాలలో 1,200 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో 639మంది వసతి గృహంలో ఉంటున్నారు.

మసకబారిన కాకతీయ యుజీసీ వైభవం

కేఎస్ఎమ్ కళాశాల ప్రభ రోజు రోజుకూ మసక బారిపోతోంది. కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉన్న కొత్తగూడెం మైనింగ్ కళాశాలలో గతంలో సీటు పొందాలంటే ప్రవేశ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు సాధించిన వారికే సీటు దక్కే అవకాశం ఉండేది. ఈ కాలేజీలో ఉన్నత ప్రమాణాలతో మైనింగ్ విద్యను అందించే వారు. కానీ నేడు ఈ కళాశాలలో తరగతి గదులు, ప్రాక్టికల్స్ రూములు, డైనింగ్‌హాల్, ఇండోర్ స్టేడియం, బాలుర వసతి గృహాలనీ శిథిలావస్థకు చేరాయి. కళాశాలపై యూనివర్సిటీ పర్యవేక్షణ కరువైంది. 2003 నుంచి 2013 వరకు ఈ కాలేజీలో ఇంజనీరింగ్ విద్యతో పాటు ఎంబీఏ, ఎంసీఏ గ్రూపులు ఉండేవి. క్రమేపీ ఈ గ్రూపుల్లో అడ్మిషన్లు తగ్గడంతో ఈ రెండు గ్రూపులను రద్దు చేశారు. కళాశాలలో అంతర్గత రోడ్లు సరిగా లేకపోవడం, విపరీతమైన కోతుల బెడదలతో వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులు కాలేజీకి హాజరయ్యేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కళాశాలలో శిథిలావస్థకు చేరిన ఇండోర్ స్టేడియం

అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ కళాశాలకు వెళ్లేందుకు తొలుత విద్యార్థులు విముఖత చూపారు. తొలిరోజుల్లో దీనిపై వ్యతిరేకతలు, నిరసనలు వెల్లువెత్తాయి. దాంతో స్పందించిన సింగరేణి సంస్థ విద్యార్థులను తరగతి గదులకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. సుమారు 45 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ కళాశాలలో గతంలో 33 మంది రెగ్యులర్ ఉద్యోగస్తులతో పాటు, 100మంది అధ్యాపకేతర సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం కళాశాలలో 9మంది అధ్యాపక సిబ్బంది, ఏడుగురు కాంట్రాక్ట్ ఉద్యోగులు, 44మంది అధ్యాపకేతర సిబ్బంది మాత్రమే కొనసాగుతున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలి

కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కళాశాలను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మార్చాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం ప్రాంతం అనేక పరిశ్రమలకు నిలయమై ఉంది. వాటిలో సింగరేణి ప్రధాన కార్యాలయం, బొగ్గు గనులు, నవభారత్ వెంచర్స్, జెన్కో వంటి పరిశ్రమలు ఉన్నాయి. కొత్తగూడెంలో మైనింగ్‌ఇంజనీరింగ్ కళాశాల కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కళాశాలనే అభివృద్ధి చేసి యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చాలని ప్రతిపాదించారు. దాంతో పరిశ్రమల వృద్ధితో పాటు స్థానికంగా నాణ్యమైన విద్య అందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా కొత్తగూడెంలో విమానాశ్రమం ఏర్పాటు ప్రతిపాదన ఉండడంతో భవిష్యత్తులో విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ కాలేజీని యూనివర్సిటీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌గా మార్చితే ఇక్కడ యూజీ, మాస్టర్ పీహెచ్‌డీ, భూగర్భశాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, జియోఫిజిక్స్, జియో కెమిస్ట్రీ వంటి కోర్సులు అదనంగా చేర్చాలని నిపుణులు కోరుతున్నారు.

రక్షణ చర్యలపై నిత్యం అవగాహన కల్పించాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

అశ్వాపురం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ గ్రామాల ప్రజల్లో నిత్యం రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలోని ప్లాంట్ అతిథిగృహంలో ఏటా నిర్వహించే ఆఫ్‌సైట్ ఎమర్జెన్సీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ఆఫ్‌సైట్ చైర్మన్‌గా, ప్లాంట్ జీఎం హెచ్‌కె.శర్మ ఆన్‌సైట్ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రమాదాల నివారణకు ప్లాంట్ యాజమాన్యం చేపడుతున్న భద్రతా చర్యలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ప్లాంట్ నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు విడుదలయినట్లు ప్రకటించి, మిట్టగూడెం గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్‌ను క్రమం తప్పకుండా నిర్వహించటం ద్వారా అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. సమావేశంలో డీజీఎం జి.శ్రీనివాస్, సీఏఓ జి.వేణు, ఐఆర్ఓ కె.లత, సేఫ్టీ మేనేజర్ యోహాన్, భారజల ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీవాస్తవ్,ప్రొడక్షన్ మేనేజరు తిరుమలరావు, మెయింటనెన్స్ మేనేజర్ రఫిక్‌అహ్మద్, వెంకటేష్ పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోవాలి

» ఐటీడీఏ పీఓ రాహుల్
» గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల తనిఖీ



భోజనం చేస్తున్న పీఓ రాహుల్

ఖమ్మంరూరల్, డిసెంబరు11: ప్రతీ విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదువుకోవాలని ఐటీడీఏపీఓ రాహుల్ తెలిపారు. మండల పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించారు. పదోతరగతి విద్యార్థులలను పరీక్షల్లో ఎలా తర్ఫీదు ఇస్తున్నారో తెలుసుకున్నారు.అనంతరం మోనూను పరిశీలించారు. వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఉద్దీపన నూతన గణిత, ఆంగ్ల పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిడి.విజయలక్ష్మీ, ఆర్‌సీఓ నాగార్జున్, ఏటీడీఓ జహిరుద్దీన్, సత్యవతి, ఏసీఎమ్‌ఓ రాములు,ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, రమ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు జూలూరుపాడు విద్యార్థి

జూలూరుపాడు,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో నిర్వహించే గణిత టాలెంట్ టెస్ట్‌కు జూలూరుపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్.నిశాంత్ ఎంపికయ్యాడు. బుధవారం కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతిని సాధించాడు. డీఈఓ వెంకటేశ్వరచారీ నుంచి బహుమతిని అందుకున్నారు.



బహుమతిని అందుకుంటున్న నిశాంత్

జర్నలిస్టుల నిరసన

ఖమ్మంటౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జర్నలిస్టులపై సినీనటుడు మోహన్‌బాబును, అతడి అనుచరులు దాడి చేయటాన్ని ఖండిస్తూ ఖమ్మంలో టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు వినతిపత్రం అందచేశారు. విధినిర్వహణలో భాగంగా వెళ్లిన జర్నలిస్టులపై బౌన్సర్లు, రౌడీలతో దాడి చేయించటం అమానుషమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వనం వేంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్, టీయూడబ్ల్యుజే-ఐజేయూనగరశాఖ అధ్యక్ష,కార్యదర్శులు మైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఉచిత వైద్యశిబిరాలు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంకలెక్టర్ ఆదేశాల మేరకు ఖమ్మం నగరంలో ఆటో, రిక్షా కార్మికులకు నేడు రేపు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోన్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి కళావతిబాయి తెలిపారు. భక్తరామదాసు కళాక్షేత్రం,నయాబజార్ హైస్కూల్ గ్రౌండ్‌లో,ఆర్టీవో ఆఫీస్ గట్టయ్య సెంటర్‌లోనూ ఏర్పాట్లు చేశామని చెప్పారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం భక్త రామదాస్ కళాక్షేత్రం లోని వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో హాజరై తగిన పరీక్షలు, చికిత్సలు చేయించుకోవాలని కోరారు.

నిర్మాణాల్లో నిర్లక్ష్యం.. నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

» ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో జాప్యం
» భద్రాద్రి జిల్లా కేంద్రంలో ఇబ్బందులు పడుతున్నరైతులు





అసంపూర్తిగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, తాత్కాలిక షెడ్లు

కొత్తగూడెంటౌన్,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యవైఖరి కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పనులను సంబంధిత అధికారులు జాప్యం చేయడం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో రైతులు పంటలను విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతలో ఏర్పాటు చేసిన రైతుబజారును కూల్చిన అధికారులు.. శాశ్విత నిర్మాణం కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ప్రారంభించారు. పనుల నత్తనడక కారణంగా రైతులు తాత్కాలిక షెడ్లలో ఇబ్బందులకు గురవుతున్నారు.

2002లో రూ.4.50కోట్ల విడుదల

కొత్తగూడెంలో నిర్మించతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్‌అండ్ నాన్‌వేజ్ మార్కెట్ నిర్మాణ పనులకు రూ.4.50కోట్లను ప్రభుత్వం కేటాయించింది. 2002 మార్చి 3న ఆనాటి పురపాలకశాఖమంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడేళ్లు గడిచినా మార్కెట్ నిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మార్కెట్ నిర్మాణం పనులు పూర్తి అయ్యేంత వరకు తాత్కాలిక షెడ్లను నిర్మించి వ్యాపారాలు చేసుకునే విధంగా వెసులుబాటు కల్పించారు. మార్కెట్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడం వల్ల రైతులు తాత్కాలిక షెడ్లలోనే వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

అధికారుల నిర్లక్ష్యంలోనే..

రైతులు ఎండకాలంలో వేడి తీవ్ర కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులపై శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి. నిదులు ఉన్నప్పటికి పనుల్లో అధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోనే నిర్మాణ పనులు ఇలా ఉంటే పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు ఇంటిగ్రేటెడ్ పనుల్లో మరింత జాప్యం జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తోన్నాయి.

వర్షం వస్తే ఇబ్బందులే

కత్తి సుందరమ్మ, రైతు (సుజాతనగర్)



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల తాత్కాలిక షెడ్లలో వ్యాపారాలు చేయడం ఇబ్బందికరంగా ఉంది. వర్షం వస్తే కూరగాయలు వేరే ప్రాంతానికి తరలిస్తున్నాం. అధికారులు ఏడాదిలో మార్కెట్ పూర్తి చేస్తామని చెప్పి మూడేళ్లు దాటుతున్నా పూర్తి చేయడం లేదు. వ్యాపారాలు సైతం సక్రమంగా లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం





బహుమతిని అందుకుంటున్న జిల్లా జట్టు, బెస్ట్ రైడర్ అవార్డు అందుకుంటున్న భవాని

ఖమ్మంస్పోర్ట్స్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఇటీవల జరిగిన 71వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో జిల్లా మహిళల జట్టు తృతీయ బహుమతిని సాధించింది.నల్గొండ జిల్లా జట్టు ప్రథమ,రంగారెడ్డి జిల్లా జట్టు ద్వితీయ బహుమతిని సాధించింది. ఖమ్మం జిల్లా క్రీడాకారిణి భవాని బెస్ట్ రైడర్ అవార్డును అందుకోవడం విశేషం. విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుబూరి దయాకరరెడ్డి, సెక్రెటరీ క్రిష్టఫర్, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి అభినందించారు.

భద్రాద్రి జిల్లాకు నాలుగు విడతల్లో రూ.464 కోట్ల రుణమాఫీ

» నాలుగో విడతలో 7,282మంది రైతులకు రూ.59.33 కోట్ల లబ్ధి

కొత్తగూడెంఅర్బన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రైతు రుణమాఫీ పథకంలో ప్రభుత్వం నాలుగు విడతలుగా భద్రాద్రి జిల్లాలో 64,187 మంది రైతులకు రూ. 464.08 కోట్ల మేర రుణమాఫీ చేసింది. ఇంకా చాలామందికి రుణమాఫీ కాకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలోపు రుణాలను మాత్రమే మాఫీ చేసింది. మూడువిడతల్లో రైతుల రుణమాఫీకి సాంకేతిక లోపాల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. బ్యాంకుల్లో, ఆధార్‌కార్డుల్లో, పట్టా పుస్తకాలోల్లో పేర్లు వేర్వేరుగా ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో మొదటి విడతలో 28,450మంది రైతులకు రూ.134.41 కోట్లు, రెండోవిడతలో 16,889మంది రైతులకు రూ.143.05కోట్లు,మూడోవిడతలో11,566 మంది రైతులకు రూ.127.27కోట్లు, నాలుగో విడతలో 7,282 మందికి రూ.59.33 కోట్లతో కలిపి మొత్తం మొత్తం64,187 మందికి రూ.464.08 కోట్ల మేర నిధులు విడుదల అయ్యాయి. రైతులు సంబంధిత బ్యాంకులను సంప్రదించి రుణమాఫీ వివరాలు తెలుసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు.



'మాస్టర్ ప్లాన్' ఆమోదం ఎన్నడో?

- 5 లక్షల నుంచి 7లక్షలకు పెరిగిన జనాభా
- 40శాతానికే పరిమితమైన కేఎంసీ ఆదాయం
- అక్రమ కట్టడాలు అడ్డుకోవటంలో కార్యాచరణలోపం
- మున్నేరు బాధితులకు పరిహారం పంపిణీపై స్పష్టత ఇవ్వలేని వైనం
- నేడు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేఎంసీలో సమీక్ష





కేఎంసీ కార్యాలయం, ఫుట్‌ఫాత్ పూర్తిగా ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వ్యాపారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరం జనాభా గణనీయంగా పెరిగింది. గతంలో ఖమ్మంలో 5లక్షల జనాభా ఉండగా తాజాగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 7లక్షలకు చేరింది. మరో మూడేళ్లలో 10 లక్షలకు చేరుతుందని అంచనాలు వేస్తున్నారు. ఈ క్రమంలోనే భవిష్యత్ ఖమ్మాన్ని దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ఖమ్మం మాస్టర్ ప్లాన్ ఆమోదం పొందక పోవటంతో ఎల్ఆర్ఎస్ నుంచి ప్రధాన రహదారుల విస్తరణ వరకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధికి బాటలు

పెరుగుతున్న జనాభాకు తగిన విధంగా భవిష్యత్ ప్రణాళికలు రూపొందించటంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందు చూపుతో నిర్ణయాలు తీసుకుంటారు. ఎమ్మెల్యేగా పదేళ్ల క్రితం ఖమ్మంకు బైపాస్ రోడ్డు వేయటంతో ఇప్పుడు ప్రజలకు అత్యంత ఉపయోగంగా మారింది. అప్పుడు బైపాస్ అవసరమా.. అన్నవారు సైతం ఇప్పుడు ఔరా అంటున్నారు. రెండేళ్లుగా సుడాతో పాటుగా ఖమ్మం నగరం మాస్టర్ ప్లాన్ ఆమోదం జరగలేదు. ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇవ్వకపోవటంతో కేఎంసీకి ఆదాయ రాబడి తగ్గింది. ప్రధానమైన రహదారులు, అంతర్గత రహదారుల విస్తరణకు ఆటంకాలు ఏర్పడ్డాయి.

ఆక్రమణలు పట్టని వైనం

ఇదే క్రమంలో ఖమ్మం నగరంలో జనాభా, నివాసాలు గరిష్ట స్థాయిలోకి చేరాయి. ఇదేక్రమంలో జిల్లా కోర్టు నుంచి వైరా రోడ్డు ద్వారా పాత బస్టాండ్, నయాబజార్ సెంటర్ కూడలీ వరకు వ్యాపారులు రహదారులను ఆక్రమించి నిర్మాణాలు చేశారు. సాయంత్ర సమయంలో ప్రధాన రహదారి మీదకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఖమ్మంలోని రహదారులపై జరిగిన అక్రమ కట్టడాలను గుర్తించేందుకు 60డివిజన్లకు 60 మంది ప్రత్యేక అధికారులను నియమించారు. నెల గడుస్తున్నా అక్రమ కట్టడాలు, డ్రైనేజీల అక్రమణలపై ముందడుగు పడలేదు. టీడీపీ సెంటర్‌నుంచి గటయ్యసెంటర్ ద్వారా సరితా క్లినిక్ సెంటర్ వరకు ట్రాఫిక్ రద్దీ పెరిగింది. కొంత ప్రాంతం వరకు మాత్రమే సెంటర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

ఆదాయం తిరోగమనం

ఆదాయ రాబడిలో ఖమ్మం నగరం తిరోగమనంలో పయనిస్తోంది. గతంలో కంటే తక్కువ స్థాయిలో కేవలం 40శాతానికే ఆదాయ రాబడి చేరింది. రెవెన్యూ విభాగం ఉద్యోగులకు ఆదాయ వసూళ్ల కంటే ఇతర విధులు కేటాయించటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థ నుంచి ఓ డివిజన్‌లో సర్వే జరిపిన ముందుకు సాగటం లేదని విమర్శలు వెలువడ్డాయి.

కొందరికి అందని వరద పరిహారం

మున్నేరు ముంపు బాధితులకు పరిహారం ఓ ప్రహసనంగా మారింది. నిత్యం పదుల సంఖ్యలో ఖమ్మం నగర పాలక సంస్థకు ఆశా వాహులు, బాధితులు చేరుకుంటున్నారు. పరిహారం అందిన కుటుంబాలకు అధికారులు స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. మూడు నెలలుగా కేఎంసీ చుట్టూ తిరుగుతూ విరక్తి చెందిన బాధిత కుటుంబాల సభ్యులు అధికారులను ప్రశ్నించే స్థాయిలోకి వెళ్లారు. పారిశుధ్య వాహనాల నిర్వాహణలో ఇబ్బందులు కలుగుతున్నాయి. కేఎంసీకి మెకానిక్ ఉన్నా కనీసం వాహనాలకు పంచర్లు కూడా వేయటంలేదు. వాహనాల డ్రైవర్లు డబ్బులుపెట్టుకొని మరమ్మతులు చేయించుకుంటున్నారు.

సాయంత్రం వినతులతో ఇబ్బందులు

ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు గతంలో పనిచేసిన కమిషనర్‌లు మధ్యాహ్నం గంట సమయం కేటాయించారు. దీంతో వారు నేరుగా కమిషనర్‌ను కలిసి సమస్యలను చెప్పుకునేవారు. ఇప్పుడు సాయంత్రం సమయంలో సమయం కేటాయించటంతో ప్రజలు అధికారులను కలవలేకపోతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

నేడు మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఉదయం 10గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఆదాయం, పారిశుధ్య కార్యక్రమాల నిర్వాహణ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించనున్నారు.

రక్తదానం చేసిన అయ్యప్ప స్వాములు



ఖమ్మం సాంస్కృతికం డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వీడీవోస్ కాలనీలోని తాండ్ర అన్నప్రసాద కేంద్రంలో బుధవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో 20మంది అయ్యప్ప స్వాములు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్ గురూజీ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ బొల్లి కొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరామ్, డాక్టర్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదవాగు ప్రాజెక్టుకు రూ.92 కోట్లు

(5వ పేజీ తరువాయి)

పునర్‌నిర్మాణానికి తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది.

ఈ సమాచారాన్ని ఏపీ ప్రభుత్వానికి కూడా తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న మూడుగేట్లతో పాటు కొత్తగా మరో 5గేట్లు కలిపి మొత్తం 8గేట్లతో ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదించారు. గతంలో 40 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మాత్రమే అవకాశం ఉన్న ఈ ప్రాజెక్టును లక్షా 4 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచుతూ ప్రతిపాదించారు. ఆకస్మికంగా భారీ వరద వచ్చినా ఇబ్బంది లేకుండా 8గేట్లు ఏర్పాటు చేస్తూ రీడిజైన్ చేశారు. మొత్తం 6.1 మీటర్ల ఎత్తున నీరు నిలువ ఉండేలా ప్రాజెక్టును రూపొందించారు.

ఉమ్మడి ప్రాజెక్టు

తెలంగాణతో పాటు ఏపీ ప్రభుత్వం కూడా తమవాటా నిధులు చెల్లిస్తే ఉమ్మడి ప్రాజెక్టుగా పెదవాగు పునర్నిర్మాణ పనులు చేపట్టి సాగునీరు అందించే అవకాశం ఉంది. అయితే కేంద్ర జలసంఘం ద్వారా దీన్ని ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించేందుకు కూడా నీటిపారుదలశాఖ నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెదవాగు ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా ఎక్కువభాగం ఏలూరు జిల్లాలోని చింతలపుడి మండలం గుబ్బలమంగి అటవీప్రాంతంలో ఉంది. అక్కడ భారీ వర్షం పడితే ఈ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతుంది. భౌగోళికంగా రెండు రాష్ట్రాలకు సరిహద్దున ఈ ప్రాజెక్టు ఉన్నందున భవిష్యత్తులో ఎలాంటి నష్టం లేకుండా ఉండేలా దీన్ని రిడిజైన్ చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని నీటిపారుదలశాఖ అధికారులతో ఈ ప్రతిపాదనలు పూర్తి చేయించారు.

తాత్కాలిక రింగ్ బండ్

ప్రాజెక్టుకు గండి పడినప్పుడు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వేర్వేరుగా సందర్శించారు. ఈ ప్రాజెక్టును పునర్‌నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గండిపడిన సమయంలో నీరుమొత్తం వెళ్లిపోగా తాత్కాలికంగా తెలంగాణ ప్రభుత్వం రూ.3.5కోట్లతో ఒక మీటర్ ఎత్తు, 220మీటర్ల పొడవున ప్రాజెక్టుకు రింగుబండ్ ఏర్పాటుచేసి అశ్వారావుపేట మండలంలో ఉన్న 2,500 ఎకరాలకు సాగునీరు అందించింది. అయితే మళ్లీ వర్షాకాలం వస్తే ఈ తాత్కాలిక రింగ్‌బండ్ కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగానే శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తే పనులు చేపట్టవచ్చని భద్రాద్రి జిల్లా నీటిపారుదల సీఈ శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్టు ఈఈ సురేష్ తెలిపారు.

ఖమ్మం ఇల్లెందుకు బస్ సర్వీస్‌ల పెంపు

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఇల్లెందు రూట్లలో ప్రతీ 30 నిమిషాలకు ఒక బస్ సర్వీస్‌ను అందుబాటులోకితీసుకొచ్చామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు. మరిన్ని వివరాలకు ఖమ్మం బస్టాండ్‌లో సంప్రదించాలని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం వీటిని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

ముగిసిన గణిత పోటీ పరీక్ష


ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నగరంలోని శ్రీనివాస నగర్ రెజోనెన్స్ పాఠశాలలో నిర్వహించిన గణితప్రతిభా పోటీపరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఫలితాల్లో మొత్తం 9మంది రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 9మంది విజేతలకు ఒక్కొక్కరికి రూ.10వేల బహుమతిని నగరంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అందించారు.

మంత్రి పొంగులేటిని కలిసిన మహేష్



ఖమ్మంరూరల్, డిసెంబరు11: రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని రూరల్ మండలానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు మహేష్ బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో కలిశారు. మండలంలోని వివిధ సమ్యల పరిష్కారానికి సంబందించి మంత్రులకు వినతి పత్రాలు అందజేశారు.

కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



ఖానాపురం,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): 1981లో విజయనగరంలో కానిస్టేబుళ్లుగా శిక్షణ పొందిన కొందరు బుధవారం సీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఖమ్మానికి చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ బోడేపూడి రాజారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో వారు పని చేసిన అనుభవాన్ని పంచుకున్నారు. వారిలో అందరూ నేడు ఉద్యోగ విరమణ పొందారు.

వరికొయ్యలు కాల్చితే పొలాలకు నష్టం

- జిల్లా వ్యవసాయాధికారి



పొలాన్ని పరిశీలిస్తున్న పుల్లయ్య

నేలకొండపల్లి,డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): వరి కోసిన అనంతరం కొయ్యలు తగులబెట్టటం వల్ల పొలాలకు, పర్యావరణానికీ నష్టమేనని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని బోదులబండ, రామచంద్రాపురం, అప్పలనర్సింహాపురం,మంగాపురంతండా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. వరి క్షేత్రాలను పరిశీలించారు. వరి కొయ్యలను కాల్చటం వల్ల పొలంలోని వానపాములు చనిపోతాయని, కాల్షియం పోతుందన్నారు. పొలంలో నీళ్లు పెట్టి దమ్ము చేయటం ద్వారా వరి కొయ్యలు పొలానికి ఎరువుగా మారుతుందన్నారు. వరికొయ్యలను కాల్చటం వల్ల పర్యావరణ సమతుల్యం సైతం దెబ్బతింటుందన్నారు. అనంతరం డీఏఓ ధాన్యపు కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహకార సంఘాల్లోని ఎరువుల గోదాములను తనిఖీ చేశారు. ఏవో రాధ, ఏఈఓలు దుర్గాభవాని, అవినాష్, ఆశ్వరి, శిరీష పాల్గొన్నారు.

విద్యామహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నేలకొండపల్లి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఈనెల14, 15 తేదీల్లో సత్తుపల్లిలో జరుగనున్న జిల్లా 6వ విద్యా మహాసభల పోస్టర్‌ను యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి తొర్తి గురవయ్య బుధవారం రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కును కల్పించాలని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన చెన్నారం పాఠశాల విద్యార్థిని ప్రియను సన్మానించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, జ్యోతి, రామారావు, నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఆదిత్యకుమార్ పాల్గొన్నారు.

15న ఆటో మోటార్ జిల్లా మహాసభలు

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించేలా ఉద్యమ కార్యచరణకు ఈనెల 15న ఆటో మోటార్ కార్మికుల జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని టీయూసీఐ(ఐఎఫ్‌టీయూ) సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌కే లాల్‌మియా పేర్కొన్నారు. బుధవారం పీఎస్‌ఆర్ రోడ్డులో నిర్వహించిన సమావేశంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మహాసభలు జరుగుతాయని ప్రకటించారు. కార్మికులు వీటిని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. నాయకులు యడ్లపల్లి ఉపేందర్, నాగయ్య, చంద్రయ్య, రాంబాబు, నర్సింహారావు పాల్గొన్నారు.

పట్టణస్థాయి సీఎం కప్ క్రీడాపోటీల ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్ డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం మున్సిపల్(పట్టణ)స్థాయి సీఎంకప్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదువుతో పాటు క్రీడలను తమ జీవితంలో భాగం చేసుకోవాలని అన్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు అథ్లెటిక్స్, చెస్, యోగా, కరాటే, వాలీబాల్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ షఫీవుల్లా, డీఈ ధరణికుమార్, మేనేజర్ విజయానంద్, కార్పొరేటర్లు బుడిగం శ్రీనివాస్, తేజావత్ హుస్సేన్, అంజిరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నర్సింహమూర్తి ఉన్నారు.

క్రీడలతో విజయ స్ఫూర్తి

రఘునాథపాలెం: క్రీడల ద్వారా విద్యార్థులకు విజయస్ఫూర్తి కలుగుతుందని ఎంఈవో రాములు, మాజీ ఎంపీటీసీ యర్రగర్ల హనుమంతరావు పేర్కొన్నారు. రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు విజేతలకు బహుమతులను అందించారు.





బహుమతులు అందిస్తున్న ఎంఈవో రాములు, మాజీఎంపీటీసీ హనుమంతరావు, పరుగు పోటీని ప్రారంభిస్తున్న కమిషనర్

ఇళ్ల దరఖాస్తుల సర్వే పక్కాగా నిర్వహించాలి

- కలెక్టర్లతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి):ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వే పక్కాగా నిర్వహించాలని రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం ఆయన, హైదరాబాద్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, గ్రూప్2 పరీక్షల నిర్వహణ, సంక్షేమ హాస్టల్స్ నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆన్లైన్ ద్వారా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం గ్రూప్ 2 పరీక్షలు నిర్వహణపై సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి సీపీ సునీల్‌దత్, ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్ సాయి, జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'ప్రజా రగ్ జోశ్' యాత్రకు సంఘీభావం

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఈనెల 8న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో ప్రారంభమైన ప్రజారగ్‌జోశ్ యాత్ర బుధవారం ఖమ్మం చేరుకుంది. వీరనారీమణుల ఆశయసాధన సమితి అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి వారికి స్వాగతం పలికారు. అనంతరం జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ కోత

ఖమ్మంసంక్షేమ విభాగం: ఖమ్మం నగరంలోని రోటరీనగర్, ఇందిరానగర్, రాజరాజేశ్వరి దేవాలయం ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ లక్ష్మణ్ తెలిపారు. రోటరీ నగర్ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపేస్తున్నారు.

సైన్స్ ఫెయిర్‌లో సత్తాచాటిన ప్రైవేటు విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలిడిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో సోమ, మంగళ వారాల్లో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేయిర్‌లో పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నగరంలోని న్యూఇరా, త్రివేణి, విన్‌ఫీల్డ్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వీరిని ఆయా పాఠశాలల యాజమాన్యాలు అభినందించారు.



విద్యార్థులతో విన్‌ఫీల్డ్ పాఠశాల డైరెక్టర్లు





విద్యార్థులతో న్యూఇరా పాఠశాల చైర్మన్ రమణారావు, విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి ప్రిన్సిపాల్

జాతీయస్థాయి పోటీలకు రెజోనెన్స్ శ్రీనగర్ విద్యార్థులు

గతసంవత్సరం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్‌ఫేయిర్‌లో రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీ విద్యార్థులు శ్రీవల్లి, గాయత్రి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో విజయవాడలో గతనెలలో నిర్వహించిన సౌత్ ఇండియా లెవల్‌లో తృతీయస్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల26న నిర్వహించే సైన్స్ ఫేయిర్‌కు వారు హాజరు కానున్నారు. వారిని డీఈవో అభినందించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కొవడా శ్రీధర్‌రావు, కృష్ణవేణి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

పరిహారం కోసం ఎదురుచూపులు

» ఎకరాకు రూ.30లక్షలు పరిహారం ఇవ్వాలని కిష్టారం రైతుల వినతి

సత్తుపల్లి, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గని తవ్వకాల్లో భాగం గా భూసేకరణ చేస్తున్న తమ భూములకు ఎకరాకు కనీసం రూ.30లక్షలు పరిహారం ఇవ్వాలని భూ నిర్వాసితులు కోరుతున్నారు. అధికారులు రూ.25లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారని దీ నివల్ల తాము నష్టపోతామని చెబుతున్నారు. సత్తుపల్లి మండలంలో సింగరేణి సంస్థ కిష్టారం ఓపెన్‌కాస్టు బొగ్గు గనిలో తవ్వకాల్లో భాగంగా కొంత భూమి అవసరమని భావించింది. ఈ మేరకు అధికారులకు రిక్విజేషన్ ఇవ్వడంతో అధికారులు భూసేకరణ ప్రక్రియ చేపట్టారు.

36.02 ఎకరాల సేకరణ

కిష్టారం ఓపెన్ కాస్టు బొగ్గుగనిలో తవ్వకాల్లో భాగంగా భూమిని సేకరించి సేఫ్‌జోన్‌గా ఏర్పా టు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు భూమి సేకరించి అప్పగించాలని సింగరేణి సంస్థ రెవెన్యూ అధికారులను కోరింది. ఈ మేరకు 36.02 ఎకరాల భూమిని గుర్తించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించారు. ఇందులో రెం డున్నర ఎకరాల భూమి మాత్రమే పట్టా భూమి కాగా, మిగిలినది అసైన్‌మెంట్ భూమి. మొత్తం 50మంది చిన్న సన్నకారు రైతులే ఉన్నారు.

రూ.25లక్షల పరిహారంతో నష్టం

సింగరేణి సంస్థ కోసం సేకరిస్తు న్న భూమికి సంబంధించి ఎకరాకు రూ.25లక్షలు పరిహారంగా ఇస్తామని అధికారులు చెబుతున్నారని దీని వల్ల తాము నష్టపోతామని రైతులు వాపోతు న్నారు. గతంలో రిజిస్ట్రా రు కార్యాలయంలో భూమి విలువ రూ.3.75లక్షలు ఉన్న సమయంలో సింగరేణి కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.25లక్షలు పరిహారం చెల్లించారని, కాని ప్రస్తుతం రిజిస్ట్రారు కార్యాలయంలో భూమి ధర ఎకరాకు రూ.6.75లక్షలు ఉందని నిర్వాసిత రైతులు చెబుతున్నారు. రూ.25లక్షల చొప్పున పరిహారం ఇస్తే అంతకు మించిన భూముల ధరలు మార్కెట్లో ఉన్నాయని రైతులు పేర్కొం టున్నారు. తమకు కనీసం రూ.30లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని కోరుతున్నారు. మెరుగైన పరిహారం డిమాండ్ చేస్తుంటే కొందరు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

కిష్టారం రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఇటీవల జిల్లా కలెక్టర్‌ను బాధిత రైతులను వెంబెట్టుకొని ఖమ్మంలో కలిశారు. ఈ మేరకు ఆమె కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎకరాకు రూ.25లక్షలు పరిహారం అధికారులు నిర్ణయించారని, కనీసం రూ.30లక్షలు పరిహారం ఇవ్వాలని కోరారు. అందరూ చిన్న, సన్నకారు రైతులేనని అన్నారు. మరో పక్క కలెక్టర్‌ను తాము కలసి వచ్చిన విషయం తెలుసుకొని భూసేకరణ ప్రక్రియ మరింత వేగం పెంచారని రైతులు సంతకాలు చేయాలంటూ వత్తిడి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.30లక్షలు ఇస్తేనే తమ భూములు అప్పగిస్తామన్నారు. పరిహారం విషయం తేల్చకుండా సింగరేణి అధికారులు తమ భూముల చుట్టూ రాళ్లు పాతారని రైతులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



మెరుగైన పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే రాగమయి (ఫైల్)

కురుమల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రభుత్వాలకు అండగా ఉంటాం

కొణిజర్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కురుమల ఆత్మగౌరవం కోసం కృషి చేసే ఏ ప్రభుత్వం కోసమైన కురుమల సహకారం ఉంటుందని ఖమ్మం జిల్లా కురుమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చిన్న మల్లేశం, పగడాల మధు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మించిన దొడ్డి కొమరయ్య కురుమల ఆత్మగౌరవ భవనాన్ని ఈనెల 14న సీఎం చేతులు మీదుగా ప్రారంభించడం జరుగుతుందని, దానికి సంబంధించిన ఆహ్వాన కరపత్రాలను బుధవారం కొణిజర్లలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమలంతా భవనం ప్రారంభోత్సవానికి అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కురుమల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి కురుమల సంఘ నాయకులు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు రాంబాబు, దొడ్డి సాంబయ్య, బండారు పుల్లయ్య, చింతల ఎల్లిబాబు, రామలక్ష్మణులు, వెంకన్న, నాగేశ్వరరావు, కృష్ణయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మల్లేశం

అవినీతి జరిగిదంటూ చేసిన ఆరోపణలు అవాస్తవం

» మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

సత్తుపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో అవినీతి జరిగిందంటూ బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని సత్తుపల్లి మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నా రు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు చేసిన ఆరోపణలపై ఏ విచారణకైనా సిద్ధమన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ పాలకవర్గం ఎన్నికల సమయంలో మొత్తం 23వార్డులను బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుచుకోగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొందరు, ఆ తర్వాత మరికొందరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కృషితో రూ.97కోట్ల నిధులు విడుదల కాగా, వీటిలో రూ.30కోట్లు ఎస్‌డీఎఫ్ కింద అప్పటి ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులు, డీఎంఎఫ్‌టీ నిధులు రూ.20కోట్లు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దుచేశారని వివరించారు. వీటిలో రూ.20కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు రూరల్‌లోని గ్రామాలకు ప్రస్తుత ప్రభుత్వం కేటాయించిందని, అందులో ఏమైనా అవినీతి జరిగి ఉంటే కాంగ్రెస్ నాయకులదే బాధ్యత అన్నారు. ఆరోపణలు చేసేవారు వచ్చి రికార్డులు చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే. చాంద్‌పాషా, అద్దంకి అనిల్, గుండ్ర రఘు, మారుతి బాబూరావు, కో-ఆప్షన్ మెంబర్ ఆ యూబ్‌పాషా, అమరవరపు కృష్ణారావు, నడ్డి ఆనందరావు, నరసింహారావు, అబ్దుల్లా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

హోరాహోరీగా సీఎం కప్ పోటీలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల ప్రత్యేకాధికారి సునీల్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో సత్తుపల్లి మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ముగిశాయి. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా నిరంతరం సాధన చేయాలని, అప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, గాదె చెన్నారావు, పాల్గొన్నారు.

కొణిజర్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ఏర్పాటు చేసిన సీఎం కప్ మండలస్థాయి బాలికల క్రీడలను బుధవారం ఎంపీడీవో రోజారాణి, ఎంఈవో అబ్రహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీలు షేక్ రంజాన్, దొండపాటి శ్రీనువాస్, నరసింహరావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, కృష్ణమూర్తి, గిరి, అచ్చుత్‌రావు పాల్గొన్నారు.

మధిరటౌన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఐకమత్యానికి దోహద పడతాయని మధిర మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత అన్నారు. గురువారం మధిరలోని స్టేడియంలో మండల స్థాయి సీఎం కప్ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో ప్రభాకర్ పాల్గొన్నారు.



మధిరటౌన్: పోటీలను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్



సత్తుపల్లిరూరల్: బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

వరి కొయ్యలు కాల్చొద్దు: ఏడీఏ

వైరా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలను కాల్చవేయడం వలన అనేక నష్టాలు ఉన్నాయని వైరా వ్యవసాయశాఖ ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు. మండలంలోని నారపనేనిపల్లి గ్రామంలో బుధవారం వరి కొయ్యలను తగలబెడుతున్న వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. వైరా ఏవో మంజుఖాన్, ఏఈవోలు కీర్తి, సైదులు, రైతులు పాల్గొన్నారు.

'రైతులు ఆర్థికంగా ఎదిగేలా సేవలందిస్తాం'

మధిరటౌన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): పాడి ఉత్పత్తి రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు సంఘం డెయిరీ అనేక రకాలుగా సేవలు అందిస్తుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ ప్రసాద్ అన్నారు. గురువారం మధిరలో సంఘం డైరీ వారి పాల సేకరణ, శీతలీకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరీ ఆర్‌ఎం పాతూరి ఆదినారాయణ, జేడీఎం. నాగప్రభు, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు 11 (ఆంధజ్యోతి): కల్లూరులో బుధవారం సంఘం మిల్క్ డెయిరీ శీతల కేంద్రాన్ని ఆ సంస్థ మేనేజర్ పాతూరి ఆదినారయణ, పాడి రైతు జాస్తి శ్రీనువాస్‌రావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఆదినారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ప్లాంట్ ఇన్‌చార్జి ఎస్. సురేష్, సూపర్‌వైజర్లు నాగప్రసాద్, సత్యనారాయణ, శ్రీహరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి: డీపీవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీవో ఆశాలత

బోనకల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని చిరునోముల ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ప్రణాళిక ప్రకారం చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ఏకాగ్రతతో చదివితే నిర్దేశించిన లక్ష్యాలను సులువుగా చేరుకుంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వే చేస్తున్న ఇళ్లను పరిశీలించారు. సమర్థవంతంగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థుల ఎంపిక

కొణిజర్ల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి ఎస్.కె. అమీర్‌హుస్సేన్ జిల్లాస్థాయిలో సైన్స్‌ఫెయిర్‌లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతకుమారి, గైడ్‌టీచర్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు హనుమ బుధవారం తెలిపారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు హనుమ పర్యవేక్షణలో అమీర్‌హుస్సేన్ స్కూల్‌బస్ ఫ్రెంట్ చిల్డ్రన్ డిటెక్ట్ అను ప్రాజెక్టును జిల్లాస్థాయిలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించాడు. దాంతో రాష్ట్ర రోడ్డు, కమ్యూనికేషన్ విభాగంలో విద్యార్థికి మొదటి బహుమతి వచ్చింది.

కొంత మంది విద్యార్థులు స్కూల్‌బస్ దిగి అనుకోకుండా బస్సు ముందు నుంచి వెళ్తుంటారు. డ్రైవర్ అది గమనించకుండా ముందుకు పోవడంతో ప్రమాదం జరుగుతుంది. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండటానికి సెన్సార్‌ను బస్సు ముందు భాగం యందు అమర్చినప్పుడు అది ప్లీజ్ డ్రైవర్ బస్సు ముందు పిల్లలు ఉన్నారు చూసుకోండి అని డ్రైవర్‌ను అలెర్ట్ చేస్తుంది. దాంతో ప్రమాదం తప్పుతుంది. ఇలా ప్రమాదాలు నివారించవచ్చు అని ప్రాజెక్టును ప్రదర్శించడంతో విద్యార్థిని అభినందించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఖమ్మంలో జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో విద్యార్థిన్ని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అభినందించి మెమోంటోను అందజేశారు. పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికకావడం పట్ల పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి, ఎంఈవో అబ్రహం అమీర్‌హుస్సేన్‌ను అభినందించారు.

ఏన్కూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో ఏన్కూరు మండలం బురదరాఘవాపురం విద్యార్థులు సత్తా చాటారు. ఒకే పాఠశాల నుంచి ఏడు బహుమతులు సాధించారు. జిల్లానుంచి రాష్ట్రస్థాయికి 15 ఎంపిక కాగా 6 నమూనాలు బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంపికకావడం అరుదు. అదేవిధంగా టీచర్ ఎగ్జిబిట్‌గా గైడ్‌టీచర్ సాగి సుజాత ఎంపికయ్యారు.

సీనియర్ విభాగంలో ఆహారం-ఆరోగ్యభద్రత అను విభాగంలో బి.ప్రణయ్ ప్రదర్శించిన మల్టీపర్పస్ వాకర్‌కు ప్రథమ బహుమతి, సహజ వ్యవసాయంలో పి.విశాల్ ప్రదర్శించిన ట్రాఫిక్ ఫీల్డ్ ఇన్‌సెక్ట్స్ ప్రొటెక్ట్ క్రాప్ అండ్ బీ వెల్డికు ప్రథమ బహుమతులు సాధించారు. గణిత నమూనాలు, గణన ఆలోచన అనే విభాగంలో కె.మహిమ ప్రదర్శించిన విజువలైజింగ్ మ్యాథ్స్ మోడల్ అండ్ అప్లికేషన్‌కు ప్రథమ బహుమతి లభించింది. వ్యర్థాల నిర్వాహణ విభాగంలో బి.అనుదీప్ ప్రథమ, వనరుల నిర్వాహణ విభాగంలో ఎస్‌కె సాహిద్‌పాషా ప్రథమ, విపత్తుల నిర్వాహణ విభాగంలో ఎస్‌కే జావెద్ ద్వితీయ బహుమతులు సాధించారు. టీచర్ ఎగ్జిబిట్‌లో బయాలజీ ఉపాధ్యాయురాలు సుజాత ప్రథమ బహుమతి సాధించారు. ఎంఈవో హెచ్ శ్రీనివాస్, ఎస్ఐ రఫి, ఎంపీడీవో రమేష్ వారిని అభినందించారు.

తల్లాడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలకు తల్లాడ విద్యార్థులు ఎంపిక య్యారు. స్థానిక బాలభారతి వి ద్యాలయం విద్యార్థులు టీ. అజ య్, పి. మనోజ్‌లు రూపొందించిన సాలిడు ఫెర్టిలైజర్స్ స్ప్రేయర్‌కు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో దామోదర ప్రసాద్, కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, ప్రిన్సిపాల్ తళ్లూ రి రామారావు, ఏవో శశాంక్‌లు అభినందించారు.



విద్యార్థి అమీర్‌హుస్సేన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



తల్లాడ : బహుమతులతో విద్యార్థులు



ఏన్కూర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దెబ్బతిన్న మిరప తోటల పరిశీలన

బోనకల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటికుంట్ల గ్రామంలో విత్తనలోపంతో దెబ్బతిన్న మిరప తోటలను బుధవారం ఏవో పసునూరి వినయ్ కుమార్, ఉద్యానవనశాఖాధికారి విష్ణులు పరిశీలించారు. రైతులు పాపినేని వెంకట్రావు, సాధినేని ప్రసాద్, కంచర్ల జయరాజుల మిరప తోటలకు సంబంధించి తగు నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. మరోసారి వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లగూడెం గ్రామంలో గురువారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హెచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు రగ్గులను పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకుడు ఆదూరి ఆనందం, మండల అధ్యక్షుడు పామర్తి సిద్ధు కృష్ణ చేతుల మీదగా వాటిని అందజేశారు ఈ కార్యక్రమంలో మనీ, చిల్లిముంత వెంకటేశ్వరరావు, కువ్వారపు విజయరావు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

» తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కృష్ణారావు

వైరా, డిసెంబరు 11(ఆధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ. కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి నాసరయ్య కోరారు. మాదినేని సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం వైరాలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆ సంఘం వైరా నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాదినేని సత్యనారాయణను, వైరా మండల కమిటీ అధ్యక్షుడిగా దొంతు నరసింహారావు, కార్యదర్శిగా చింతపల్లి జయరాజు, భూక్యా వెంకన్న, పట్టణకమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కన్నెగంటి వెంకటేశ్వరావు, పాశం శ్యామ్‌కుమార్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి

కారేపల్లి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంబాబు, కార్యదర్శి నరేస్‌కుమార్‌లు తెలిపారు. బుధవారం స్థానికంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రంలో ఇప్పటివరకు 870మంది రైతుల నుంచి 23,804క్వింటాల పత్తిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు పూర్తి బకాయిలు చెల్లించినట్లు తెలిపారు.

నేడు కల్లూరులో ఐక్య క్రిస్మస్ సంబురాలు

కల్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో నిర్వహించనున్న ఐక్య క్రిస్మస్ సంబురాలను విజయవంతం చేయాలని ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏనోస్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడడుతూ మతాలకు అతీతంగా స్థానికంగా కప్పలబంధం రహదారి వైపున గల లక్కినేని వారి గౌండ్స్‌లో ఈ ఐక్యక్రిస్మస్ వేడుకలు జరగనున్నాయని వివరించారు. ఈ వేడుకలకు సినీనటుడు రాజా, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు, దాసరి డేవిడ్‌రాజు, మండల అధ్యక్షుడు తేళ్ల ఏబినేజర్, ఉపాధ్యక్షుడు దయాకర్, జాన్‌పరంజ్యోతి, మహేష్, జీవన్‌కుమార్, రాజశేఖర్, సుందర్‌రాజు తదితరులున్నారు.

పెదవాగు ప్రాజెక్టుకు రూ.92 కోట్లు

(5వ పేజీ తరువాయి)

పునర్‌నిర్మాణానికి తెలంగాణ నీటిపారుదలశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది.

ఈ సమాచారాన్ని ఏపీ ప్రభుత్వానికి కూడా తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న మూడుగేట్లతో పాటు కొత్తగా మరో 5గేట్లు కలిపి మొత్తం 8గేట్లతో ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదించారు. గతంలో 40 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం మాత్రమే అవకాశం ఉన్న ఈ ప్రాజెక్టును లక్షా 4 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యానికి పెంచుతూ ప్రతిపాదించారు. ఆకస్మికంగా భారీ వరద వచ్చినా ఇబ్బంది లేకుండా 8గేట్లు ఏర్పాటు చేస్తూ రీడిజైన్ చేశారు. మొత్తం 6.1 మీటర్ల ఎత్తున నీరు నిలువ ఉండేలా ప్రాజెక్టును రూపొందించారు.

తెలంగాణతో పాటు ఏపీ ప్రభుత్వం కూడా తమవాటా నిధులు చెల్లిస్తే ఉమ్మడి ప్రాజెక్టుగా పెదవాగు పునర్‌నిర్మాణ పనులు చేపట్టి సాగునీరు అందించే అవకాశం ఉంది. అయితే కేంద్ర జలసంఘం ద్వారా దీన్ని ఉమ్మడి ప్రాజెక్టుగా నిర్మించేందుకు కూడా నీటిపారుదలశాఖ నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పెదవాగు ప్రాజెక్టు క్యాచ్‌మెట్ ఏరియా ఎక్కువభాగం ఏలూరు జిల్లాలోని చింతలపుడి మండలం గుబ్బలమంగి అటవీప్రాంతంలో ఉంది. అక్కడ భారీ వర్షం పడితే ఈ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతుంది. భౌగోళికంగా రెండు రాష్ట్రాలకు సరిహద్దున ఈ ప్రాజెక్టు ఉన్నందున భవిష్యత్తులో ఎలాంటి నష్టం లేకుండా ఉండేలా దీన్ని రిడిజైన్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని నీటిపారుదలశాఖ అధికారులతో ఈ ప్రతిపాదనలు పూర్తి చేయించారు.

ప్రాజెక్టుకు గండి పడినప్పుడు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వేర్వేరుగా సందర్శించారు. ఈ ప్రాజెక్టును పునర్‌నిర్మిస్తామని హామీ ఇచ్చారు. గండిపడిన సమయంలో నీరుమొత్తం వెళ్లిపోగా తాత్కాలికంగా తెలంగాణ ప్రభుత్వం రూ.3.5కోట్లతో ఒక మీ టర్ ఎత్తు, 220మీటర్ల పొడవున ప్రాజెక్టుకు రింగుబండ్ ఏర్పాటుచేసి అశ్వారావుపేట మండలంలో ఉన్న 2,500 ఎకరాలకు సాగునీరు అందించింది. అయితే మళ్లీ వర్షాకాలం వస్తే ఈ తాత్కాలిక రింగ్‌బండ్ కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగానే శాశ్వత పరిష్కారం కోసం నిధులు మంజూరు చేస్తే పనులు చేపట్టవచ్చని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నీటిపారుదల సీఈ శ్రీనివాసరెడ్డి, ప్రాజెక్టు ఈఈ సురేష్ తెలిపారు.

బొగ్గు లారీ-డీసీఎం వ్యాన్ ఢీ..

- ఇద్దరు డ్రైవర్లకు గాయాలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వత్సవాయికి చెందిన కే.రవి నిమ్మకాయల లోడుతో సత్తుపల్లికి వస్తుండగా కిష్టారం ఓసీలో బొగ్గును టిప్పర్‌లో నింపుకున్న డ్రైవర్ శివకుమార్ వెళ్తున్నాడు. నూతనంగా నిర్మిస్తున్న జీఎం కార్యాలయం సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురు డ్రైవర్లకు గాయాలయ్యాయి. పోలీసుల సహాయంతో క్షతగాత్రులను ఖమ్మం తరలించారు. కాగా సుమారు అరగంటపాటు నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ఉచిత పశు వైద్యశిబిరం

వైరా, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని కొష్టాల గ్రామంలో బుధవారం పశుగణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల పశు వైద్యాధికారి రాకేష్ పర్యవేక్షణలో పశు గర్భకోశ వ్యాధులకు, ఇతర వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. రైతులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ లక్ష్మణాచారి, గోపాలమిత్ర కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభలను జయప్రదం చేయండి

ఏన్కూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో జరగనున్న యూ టీఎఫ్ జిల్లా విద్యా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఏన్కూరులోని ఎమ్మార్సీ నందు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15తేదీల్లో బాలికోన్నత పాఠశాల సత్తుపల్లి నందు జిల్లా విద్యామహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రామ్‌చంద్, ఎం.పుల్లయ్య, ఉపాధ్యక్షులు శ్రీదేవి, పుల్లయ్య, రాఘవరావు, రాధాకృష్ణ, నరసింహారావు, నాగేశ్వరరావు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లావణ్య, హెచ్‌ఎం జి.నాగరాజు, రవిశంకర్‌రావు, హతిరాం, శోభన్, శ్యామల, చదర్‌రావు, రమేష్, శ్రీరాం, సింగ్యా, ఉషశ్రీ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.